

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 24.0

అధికారులు అప్రమత్తం

జిల్లాలో మొంథా తుఫాన్ హెచ్చరికలు వణుకు పుట్టిస్తున్నాయి. మూడు రోజులపాటు భారీ వర్షాలు, ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అధికార యంత్రాంగం అంతా అప్రమత్తమైంది. జిల్లాలో ఆదివారం పొడి వాతావరణం కనిపించింది. సోమవారం నుంచి వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ప్రజలంతా మూడు రోజుల పాటు ప్రయాణాలను నిలుపుకోవాలని కలెక్టర్ నాగరాణి సూచించారు.



కలెక్టర్, జేసీలతో మాట్లాడుతున్న ప్రసన్న వెంకటేశ్

ప్రత్యేకాధికారి : 86395 41520

మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాకు కేటాయించిన ప్రత్యేక పర్యవేక్షణ అధికారి వి.ప్రసన్న వెంకటేశ్ ఆదివారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్ కుమార్‌రెడ్డితో ఆయన సమావేశమై జిల్లాలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలు, ముందస్తుగా తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈనెల 28న మొంథా తీవ్ర తుఫాన్ రూపంలో ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అప్రమత్తమై రాష్ట్రంలోని అన్ని తీర ప్రాంత జిల్లాలన్నింటికీ సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు.. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఏదైనా సమాచారాన్ని ప్రత్యేక అధికారికి తెలియపరచాలంటే 86395 41520 నంబరును సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్‌శాఖ కంట్రోల్ రూమ్‌లు..

మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో విద్యుత్‌శాఖ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశామని ఎస్ఈ పి.ఉషారాణి తెలిపారు. జిల్లా కలెక్టర్, తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో 94906 10152 నంబరు కు, భీమవరం డివిజన్ ఆఫీస్ కంట్రోల్ రూమ్ 94931 77646, నరసాపురం డివిజన్ ఆఫీస్ కంట్రోల్ రూమ్ 73820 50943, తాడేపల్లిగూడెం డివిజన్ కంట్రోల్ రూమ్ 94931 77806 నంబర్లకు సమాచారం అందిస్తే సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు.

మొంథా ఫియర్



తీర ప్రాంతాల్లో హై అలర్ట్

- ఉరకలేస్తున్న సాగర తీరం

మొంథా తుఫాన్ ప్రభావంతో సముద్ర అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. తుఫాన్ హెచ్చరికలతో పాటు బీచ్ వద్దకు సందర్శకులకు అనుమతి లేదని అధికారులు ప్రకటించడంతో సాగర తీరాలు ప్రశాంతంగా ఉన్నాయి. కార్తీక మాసం మొదటి ఆదివారం తీరంలో సందర్శకులు లేకపోవడంతో వెలవెలబోయింది.

చినలంక వద్ద సముద్ర అలలు



నరసాపురంలో నిలిచిన పంటులు

- నరసాపురం-సఖినేటిపల్లి రేవుల మధ్య రాకపోకలు బంద్
- సముద్రం వద్దకు వెళ్లొద్దంటూ ఆదేశాలు
- సిద్ధం చేస్తున్న తుఫాన్ భవనాలు
- 36 పునరావాస కేంద్రాల ఏర్పాటు
- భయాందోళనలో ఆక్వా, వరి రైతులు
- భీమవరం, తాడేపల్లిగూడెం డివిజన్లలో రెవెన్యూ కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

నరసాపురం రూరల్/భీమవరం టౌన్ /భీమవరం రూరల్/తణుకు రూరల్/మొగల్తూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మొంథా తుఫాన్ తీవ్రంగా మారుతుందనే హెచ్చరికలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆదివారం నరసాపురం-సఖినేటిపల్లి రేవుల్ని మూసివేశారు. ముందస్తు జాగ్రత్తగా పంటు, పడవల రాకపోకల్ని నిలిపివేశారు. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటు సోమ, మంగళవారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలతో పాటు బలమైన గాలులు వీస్తాయన్న హెచ్చరికతో రెవెన్యూ, పోలీస్‌తో పాటు ఇతర అధికారులు అప్రమత్తమయ్యారు. తీరం దాటే వరకు నరసాపురం, మొగల్తూరు మండలాల్లో పనిచేసే సిబ్బంది స్థానికంగానే ఉండాలని ఆర్డీవో దాసిరాజు ఆదేశించారు. తీర ప్రాంత ప్రజల్ని సముద్రం వద్దకు వెళ్లనివ్వొదని, ప్రజలు బయటకు రాకుండా ఇంటి వద్దనే ఉండాలని, తుఫాన్ భవనాలను సిద్ధం చేయాలన్నారు. తుఫాన్ దిశను బట్టి అవసరమైతే తీర ప్రాంత ప్రజల్ని సురక్షిత ప్రాంతాలు, తుఫాన్ భవనాలకు తరలించేందుకు వీలుగా స్కూళ్ల భవనాలను సిద్ధం చేయాలన్నారు. అన్ని తుఫాన్ భవనాల్లో నిత్యావసర సరుకులతో పాటు విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. బలమైన గాలులకు అలలు ఎగసిపడే అవకాశం ఉన్నందున మత్స్యకారులెవ్వరూ వేటకు వెళ్లొద్దన్నారు, వేట సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించుకో వాలన్నారు. మరోవైపు తుఫాన్ కృష్ణా, కోనసీమ జిల్లాల మధ్య తీరం దాటే అవకాశం ఉండడంతో ఆ ప్రభావం తీర ప్రాంతంపై ఏ మేరకు ఉంటుందోనన్న భయం స్థానికుల్లో నెలకొంది. ముందస్తుగా నిత్యావసర వస్తువులు సిద్ధం చేసుకుంటున్నారు.

ఆర్టీసీ బస్సులు సిద్ధం

తుఫాన్ కారణంగా అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఆర్టీసీ బస్సులు సిద్ధం చేశారు. ఈ మేరకు రెవెన్యూ డివిజనల్ అధికారులు ఆర్టీసీ అధికారులతో సంప్రదింపులు చేశారు. భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెంలోని బస్సులను అందుబాటులో ఉంచుతామన్నారు.

రైతుల్లో కలవరం

మొంథా తుఫాన్ ప్రభావంతో (మిగతా 8వ పేజీలో)..

భీమవరం, తాడేపల్లిగూడెం డివిజన్లలో కంట్రోల్ రూమ్‌ల వివరాలు

కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు భీమవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని భీమవరం ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇబ్బందులపై కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.


- జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నంబరు 08816-299219
- భీమవరం ఆర్డీవో కార్యాలయం : 98484 13739, 87907 31315
- భీమవరం తహసీల్దార్ కార్యాలయం : 94910 41460
- నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం 93911 85874
- కాళ్ల తహసీల్దార్ కార్యాలయం : 94910 41456
- ఆకివీడు తహసీల్దార్ కార్యాలయం : 94910 41467
- ఉండి తహసీల్దార్ కార్యాలయం : 94910 41459
- పాలకోడేరు తహసీల్దార్ కార్యాలయం : 94910 41457
- గణపవరం తహసీల్దార్ కార్యాలయం : 83747 51009
- వీరవాసరం తహసీల్దార్ కార్యాలయం : 94910 41458
- తాడేపల్లిగూడెం కంట్రోల్ రూమ్ : 938170 1036, 98497 12358
- తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం : 94910 41442
- పెంటపాడు తహసీల్దార్ కార్యాలయం : 81213 41447
- తణుకు తహసీల్దార్ కార్యాలయం : 94910 41477
- అత్తిలి తహసీల్దార్ కార్యాలయం : 79939 48739
- ఇరగవరం తహసీల్దార్ కార్యాలయం : 94910 41476

రూ.కోటి నిధులు మంజూరు

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పునరావాస కేంద్రాల్లో కావలసిన మౌలిక సదుపాయల కల్పన కోసం ప్రభుత్వం జిల్లాకు కోటి రూపాయల నిధులు కేటాయించింది. ఈ నిధులతో మందులు, భోజన వసతి, తదితర వాటిని ఏర్పాటుకు వినియోగించనున్నారు.

సార్వా సాగుకు గండం

- భారీ వర్షాలు కురిస్తే పంటలు నీటిపాలే..



స్వర్ణ రకం చేను

సార్వా సాగుకు మొంథా తుఫాన్ గండంగా మారింది. ఈ తుఫాన్ ప్రభావంతో వంద కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. దీనిని బట్టి వరిసాగు నీటిపాలయ్యేలా ఉంది. జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో సార్వా సాగు ఉంది. లక్షకుపైగా సాగు ఈనిక, గింజ పాలుపోసుకునే దశలో ఉంది. అధిక వర్షాలు పడితే పూర్తిగా నేలకొరుగుతుంది. దానిపై వర్షపు నీరు చేరితే పంట నష్టం భారీ స్థాయిలో ఉంటుంది. ఈమేరకు రైతుల్లో గందరగోళం నెలకొంది. మొన్న అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలలో జిల్లాలో 76 గ్రామాల్లో 2,326 మందికి చెందిన 3,864 ఎకరాలు నీట మునిగాయి. తాడేపల్లిగూడెంలో 315 ఎకరాలు, ఆకివీడులో 805, అత్తిలి-210, కాళ్ల-929, ఇరగవరం-180, నరసాపురం- 130, యలమంచిలి-395, భీమవరం-300, వీరవాసరం-60, మొగల్తూరు-186 ఎకరాలు నీట మునిగినట్లు జిల్లా వ్యవసాయ శాఖ తెలిపింది. రానున్న తుఫాన్ ఎంత నష్టం చేకూరుస్తుందోనని భయం రైతుల్లో మొదలైంది.

విద్యా సంస్థలకు రెండు రోజులు సెలవులు

జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, అంగన్‌వాడీలకు ఈనెల 27, 28 తేదీలను సెలవు దినాలుగా ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు. ఆదేశాలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు పీజీఆర్ఎస్‌లు రద్దు

జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్‌ను రద్దు చేశామని కలెక్టర్ తెలిపారు. వీటితోపాటు మండల, రెవెన్యూ డివిజనల్ కార్యాలయం మునిసిపాల్టీలలో జరిగే పీజీఆర్ఎస్‌లను కూడా రద్దు చేశామన్నారు.

జిల్లాలో 36 పునరావాస కేంద్రాలు.. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం రాక

జిల్లాలో 36 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. భీమవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో 10, తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో 8, నరసాపురం డివిజన్ పరిధిలో 16 పునరా వాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, భోజన సౌకర్యంతో పాటు మెడికల్ క్యాంపులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా జనరేటర్లను ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు.

అగ్నిమాపక సిబ్బంది సిద్ధం

- జిల్లాలో ఏడు అగ్ని మాపక కేంద్రాల్లోని 90 మంది సిబ్బందిని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అందుబాటులో ఉండేవిధంగా సిద్ధం చేశారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. ఏడు అగ్ని మాపక వాహనాలు, 10 నీరు తోడేందుకు వాహనాలు, 12 చెట్లు నరికే యంత్రాలు 24 మంది సిబ్బంది సిద్ధం చేశారు. 80 లైఫ్ జాకెట్లు సిద్ధం, 40 లైఫ్ బాయ్స్, 30 రోప్‌లు, సిద్ధం చేశారు. ఈ కేంద్రాలకు అవసరమైన నిత్యావసర వస్తువుల్ని, కూరగాయలను ఆదివారం రాత్రి ఆర్డీవో దాసిరాజు, సిబ్బంది ఆధ్వర్యంలో రైతు బజారుల్లో కొనుగోలు చేసి కేంద్రాలకు తరలించారు.

ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం రాక

నరసాపురం, మొగల్తూరు మండలాలకు 26 మందితో కూడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం ఆదివారం రాత్రి చేరుకుంది. సోమవారం ఆ శాఖకు చెందిన ఎస్పీ స్థాయి అధికారి పరివేక్షణంలో వీరు పని చేయనున్నట్లు సమాచారం



సిద్ధంగా ఉన్న అగ్నిమాపక సిబ్బంది

అర్హులందరికీ ఇళ్లు

- నవంబరు 5లోగా దరఖాస్తుల స్వీకరణ
- ఇప్పటికే అందిన 7,232 దరఖాస్తులు
- అర్హతలను పరిశీలించనున్న గృహనిర్మాణ శాఖ



భీమవరం- ఆంధ్రజ్యోతి : రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని ఆవాస్ యోజన గ్రామీణ పథకంలో ఇళ్ల మంజూరు చేయనుంది. పల్లెల్లో సొంత స్థలం ఉన్నవారు. సొంత ఇళ్ల నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేయనుంది. జిల్లాలో వచ్చే నెల ఐదో తేదీ లోగా దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేసింది ఇదివరకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటికి 7,232 మంది గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇంటి కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అవి పెండిగిలో ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయం కోసం గృహనిర్మాణ శాఖ అధికారులు ఎదురుచూస్తూ వచ్చారు.

పట్టణ ప్రాంతంలో దరఖాస్తు చేసుకున్న 595 మంది లబ్ధిదారులకు ఇటీవల ప్రభుత్వం ఇళ్ల మంజూరు చేసింది. ప్రతీ లబ్ధిదారునికి రూ. 2.50 లక్షలు కేటాయించింది. ఇందులో రూ.1.50 లక్షలు కేంద్ర ప్రభుత్వం మరో లక్ష రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు వచ్చేసరికి కేంద్రం నుంచి రూ. 1.20లక్షలు రాయితీ ఇవ్వనున్నారు. ఉపాధి హామీ పథకంలో మరో రూ.50వేలు మంజూరు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామీణ ప్రాంత లబ్ధిదారులకు ఎంతమేర రాయితీ ఇవ్వనున్నారో స్పష్టత రావలసి ఉంది. అర్హుల జాబితా తేలిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ఇళ్లకు ఇచ్చే నిధులపై స్పష్టత ఇవ్వనుంది.

వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

వైసీపీ హయంలో సొంత స్థలం ఉన్న లబ్ధిదారులకు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికే ప్రాధాన్యం ఇచ్చారు. అవి పూర్తిస్థాయిలో చేపట్టలేకపోయారు. ఇప్పటికి అనేక లే-అవుట్‌లలో పెండింగ్‌లో ఉన్నాయి. మట్టితో కూడా పూడ్చలేకపోయారు. నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సొంత స్థలం ఉన్నవారికి అధిక నిధులు కేటాయించి నిర్మాణ పనులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకుంది. పట్టణ ప్రాంతాల లబ్ధిదారులకు నిధులు మంజూరు చేసింది. తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

అందిన దరఖాస్తులు ఇలా..

ఆచంట-226, ఇరగవరం-224, మొగల్తూరు-303, నరసాపురం-258, పాలకొల్లు-326, పెనుగొండ-243, పెనుమంట్ర-162, పోడూరు-249, తణుకు-182, యలమంచిలి-438, ఆకివీడు-288, అత్తిలి-263, భీమవరం-500, కాళ్ల-399, పాలకోడేరు-167, పెంటపాడు-801, తాడేపల్లిగూడెం-972, ఉండి-175, వీరవాసరం-393, గణపవరం-663. మొత్తం 7,232 దరఖాస్తులు అందాయి.

ఎక్కడి బస్సులు అక్కడే.. గప్‌చుప్!



- కొన్ని బస్సులు నిలిపివేత ?
- బుకింగ్ కార్యాలయాల మూత
- టిక్కెట్లు లేవని సమాధానం
- నిర్వాహకులకు కేసుల భయం!


కొనసాగుతున్న రవాణా శాఖ తనిఖీలు

భీమవరం క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సులు వెళ్లని, నడపలేని మార్గాల్లో సైతం ప్రైవేటు బస్సులు రయ్‌న దూసుకుపోతాయి. ఆ మార్గాలు ప్రైవేటు ఆధీనంలో ఉంటాయి.. ఆదాయ మార్గాలను అన్వేషిస్తారు. బస్సులను రిజిస్ట్రేషన్‌లో చార్జీలు ఏ రాష్ట్రంలో తక్కువైతే అక్కడ స్థానికులుగా వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయించగలరు. నేషనల్ పర్మిట్ పొంది దేశంలో ఏ ప్రాంతానికైనా బస్సులను తిప్పగలరు. ప్రైవేటు ట్రావెల్స్ దందా ఇది. కర్నూలులో బస్సు దహనం సంఘటన నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఎక్కడికక్కడే నిలిపివేశారు. బుకింగ్ కార్యాలయాలు మూసివేశారు. టిక్కెట్లు లేవని సమాధానమి స్తున్నారు. నిర్వాహకులకు కేసుల భయం పట్టుకుంది.

వాస్తవానికి కాంట్రాక్టు అండ్ క్యారేజీ పేరుతో రిజిస్ట్రేషన్ అవుతున్న బస్సులు స్టాపేజీ ప్రకారం వెళ్లకూడదు. కానీ ఒకే వ్యక్తి కాంట్రాక్టుకు బస్ బుక్ చేసుకున్నారని, అతడి పాసింజర్లు ఆయా ప్రాంతాల్లో ఎక్కి దిగుతారంటూ చెప్పుకొస్తారు. ప్రజల సౌకర్యార్థం ప్రజారవాణాకు ఉపయోగపడుతున్నాయని అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇదే అదునుగా తీసుకున్న కొంతమంది ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు ఒక బస్సును రిజిస్ట్రేషన్ చేయించి అదే నంబర్‌తో మరో బస్సును అదే రూటులో ఆపోజిట్ మార్గాల్లో తిప్పుతున్న సంఘటనలు గతంలో రవాణాశాఖ అధికారుల తనిఖీల్లో బయట పడ్డాయి. కొన్ని బస్సులకు సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో వాటిపై తరచుగా కేసులు రాస్తూ జరిమానా విధిస్తూనే ఉన్నారు. ఎవరైనా ఎక్కువ చార్జీలు వసూలు చేసినా సహించేది లేదంటూ రవాణాశాఖ అధి కారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా పండుగ సమయాలు, ప్రైవేటు ట్రావెల్స్ బస్సు నిర్వాహ కులు అందిన కాడికి అడ్డంగా దోచేసుకుంటు న్నారు. ఆ వాహనాలను సీజ్ చేస్తే ప్రయాణి కులు ఇబ్బంది పడుతారనే కారణంతో అధికారులు హెచ్చరికలతో వదిలివేస్తున్నా రద్దీ సమయాల్లో అధిక ధరతో ప్రయాణికులను దోచేస్తున్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై తనిఖీలు.. రెండు బస్సులు సీజ్

కర్నూలులో ఈనెల 24వ తేదీ తెల్లవారుజామున జరిగిన బస్సు ప్రమాదంలో 19 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో రవాణా శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. భీమవరంలో రెండు రోజులుగా ట్రావెల్స్ బస్సులను తనిఖీలు చేస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా రోడ్డుపై తిరుగుతున్న బస్సులపై కేసులు నమోదు చేస్తున్నారు. కొంతమంది బస్సుల యాజమాన్యాలు రెండు రోజులుగా బస్సులను తిరగకుండా నిలిపివేశారు. తనిఖీలు ముమ్మరం కావడంతో వారు అప్రమత్తమయ్యారు. ఆదివారం ఉదయం తనిఖీలు చేసి రెండు బస్సులను సీజ్ చేసినట్టు జిల్లా రవాణా శాఖ అధికారి కృష్ణారావు తెలిపారు. తనిఖీలు కొనసాగుతూనే ఉంటాయని వివరించారు. ఆదివారం రాత్రి కూడా తనిఖీలు కొనసాగుతున్నాయి.



మార్కెట్‌లో నాఫెడ్ ఉల్లి 7

నేడు సహకార ఉద్యోగుల ఆందోళన

సామూహిక సెలవు

రాట్.. ఉపాధ్యాయ సంఘాలు విముఖం

- టెట్ రివ్యూ పిటిషన్‌కు ఆలోచన
- రాష్ట్ర కమిటీకి జిల్లా ఉపాధ్యాయ సంఘాల సూచన

భీమవరం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): టెట్ పరీక్ష ఉత్తీర్ణత ఉపాధ్యాయులకు తప్పనిసరి అనే సూచనను ఉపాధ్యాయ సంఘాలు విముఖంగా ఉన్నాయి. టెట్ పరీక్ష నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఉపాధ్యాయ సంఘాలు సమావేశాల్లో నిమగ్నమయ్యారు. మొన్న ఫ్యాప్టో, ఆదివారం పీఆర్‌టీయూ ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పీఆర్‌టీయూ జిల్లా సంఘం కోర్టు ఇచ్చిన తీర్పును రివ్యూ చేయవలసినదిగా రాష్ట్ర కమిటీని కోరడం జరిగింది. మొత్తం మీద ఉపాధ్యాయుల సంఘాలు ఉపాధ్యాయులకు టెట్‌పై రివ్యూ పిటిషన్ రాష్ట్ర ప్రభుత్వం వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 5 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ అర్హత తప్పనిసరిగా మారింది. వీరిలో చాలామంది 30 ఏళ్ల పైబడి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. గతంలో పదోన్నతి కోసం పరీక్షలు పాసై ప్రమోషన్లు పొందామన్నారు. అలాంటి వారికి టెట్ పరీక్ష రాయాలని మాటలు వినిపిస్తున్నాయి.



ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు

మంత్రికి వినతిపత్రం అందజేత





మంత్రి కారులో వెళుతున్న బండారు

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- నరసాపురంలో భారీ బైక్ ర్యాలీ
- ఇన్‌చార్జి మంత్రి రవికుమార్, జిల్లా అధ్యక్షుడు రామరాజుకు వినతిపత్రం అందజేత

ఆహ్వాన పత్రికలో పేరు లేకపోవడంపై బండారు వర్గీయులు ఆగ్రహం

నరసాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నరసాపురం టీడీపీలో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు మధ్య చాపకింద నీరులా ఉన్న విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఆదివారం ఏఎంసీ చైర్మన్ ఆహ్వాన పత్రికలో బండారు పేరు లేకపోవడంపై ఆయన వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాయపేటలో బండారు కార్యాలయం నుంచి లలితాంబ రేవు వరకు సాగిన ఈ ర్యాలీలో నరసాపురం, మొగల్తూరు మండలాలతో పాటు పట్టణానికి చెందిన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా బండారు వర్గీయులు మంత్రి రవికుమార్ అపాయింట్‌మెంట్ తీసుకోవడంతో ర్యాలీ రేవు వద్దకు రాగానే అతిథి గృహం నుంచి బయటకు వచ్చారు. ఆ సమయంలో టీడీపీ నాయకులు కొట్టు పండు, చాగంటి ఆనంద్ ఇన్‌చార్జి రామరాజుపై పలు ఫిర్యాదులు చేశారు. నియోజకవర్గంలో టీడీపీ మనుగడ కొనసాగాలంటే ఇన్‌చార్జిని మార్చాలన్నారు. అనంతరం రవికుమార్‌కు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజుకు వినతిపత్రం అందించారు.

బండారును కారెక్కించుకున్న మంత్రి..

ఏఎంసీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న మంత్రి రవికుమార్ తిరిగి విజయ వాడ వెళుతూ మాజీ ఎమ్మెల్యే బండారుకు ఫోన్ చేశారు. మండలంలోని సీతారాంపురం పెట్రోల్ బంకు వద్దకు వస్తానని చెప్పడంతో బండారు ఆయన వర్గీయులతో అక్కడ నిరీక్షించారు. రాగానే కొద్దిసేపు అనుచరులతో ఫొటోలు దిగిన మంత్రి బండారును కారెక్కమన్నారు. ఆ వాహనంలో జిల్లా అధ్యక్షుడు రామరాజు ఉన్నారు. బండారుతో ఏమి మాట్లాడారన్నది బయటకు పొక్కలేదు. వీరు కారులో కృష్ణా జిల్లా పెడన వరకు వెళ్లినట్లు సమాచారం.

తగ్గని చికెన్ ధరలు

కానరాని కార్తీక మాసం ఎఫెక్ట్.. తగ్గిన చికెన్ సప్లయ్

బ్రాయిలర్ రైతుల ముందు జాగ్రత్త



తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం వచ్చిందంటే చికెన్ ధరలు అమాంతం పడిపోతాయి. ప్రతి సంవత్సరం కార్తీక మాసం వచ్చిందంటే చికెన్ ధరలు అమాంతం పడిపోయి బ్రాయిలర్ రైతులు ఇబ్బంది పడేవారు. మళ్లీ జనవరి నాటికి కాని కోలుకోలేని పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుతం రైతులు కోళ్ల పెంపకం విషయంలో కొంత స్ట్రాటజీ పాటిస్తుండటం వల్ల చికెన్ ధరలు నిలకడగా ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో కేజీ చికెన్ రూ.150కి పడిపోయేది. కానీ ప్రస్తుతం బ్రాయిలర్ లైవ్ రూ.150 పలుకుతుండగా మాంసం స్కిన్‌తో రూ.220, స్కిన్‌లెస్ రూ.240 విక్రయిస్తున్నారు. రానున్న రోజుల్లో ఇదే ధరలు ఉండే పరిస్థితి ఉందని అవసరమైతే ధరలు పెరిగినా ఆశ్చర్యపోనవసరం లేదని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో సాధారణ రోజుల్లో రోజుకు రెండు టన్నుల వరకూ చికెన్ అవసరమవుతుంటుంది. అదే ఆదివారం అయితే ఆ డిమాండ్ 4 టన్నుల వరకు అవసరమవుతుంది. అదే కార్తీక మాసంలో దాదాపుగా మూడు టన్నులు వరకే డిమాండ్ ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కార్తీక మాసం దృష్టిలో పెట్టుకుని బాయిలర్ రైతులు కూడా బ్రాయిలర్ పిల్లల సంఖ్య తగ్గించడంతో డిమాండ్‌కు తగ్గట్టే కోళ్ల లభ్యత ఉంటుంది. దీంతో ధరల్లో పెద్దగా మార్పు ఉండదని బావిస్తున్నారు,



కొత్తగా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారిని సత్కరిస్తున్న మంత్రి

ఆదర్శ సమాజానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకం

పాలకొల్లు టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆదర్శ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు నియోజకవర్గ స్థాయిలో ధర్మారావు ఫౌండేషన్ ద్వారా ఉచితంగా డీఎస్సీ శిక్షణ పొంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన 40 మందిని, అవనిగడ్డ ప్రగతి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు పూర్ణచంద్ర రావును మంత్రి డాక్టర్ నిమ్మల ఘనంగా సత్కరించారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ తన జీవితంలో ఇంత మంచి రోజును మరువలేనన్నారు. తన తండ్రి ధర్మారావు పేరుతో ఏర్పాటు చేసిన ధర్మారావు ఫౌండేషన్ ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందజేసిన వారిలో 40 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని మంత్రి నిమ్మల తెలిపారు. ఈ మహాయజ్ఞంలో విజయవంతం కావడానికి కృషి చేసిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు, ఉద్యోగాలు సాధించిన వారికి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారిని, వారి కుటుంబ సభ్యులను మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఘనంగా సత్కరించారు. చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నసమయంలో సుమారు 2లక్షల మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రవేశ పెడుతున్న సంస్కరణలతో విద్యావ్యవస్థ రూపురేఖలు మారనున్నాయని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. నియోజక వర్గంలోని డీఎస్సీ అభ్యర్థులు 600 మందికి 130 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరిగిందని, వారిలో 40 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో వీరాస్వామి, ప్రిన్సిపాల్ డిఎస్ఆర్, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన గౌరునాయుడు, తులా రామలింగం, కెకె ప్రసాద్, జిఎస్ఎన్‌రాజు, ఎం పెద్దిరాజు, పాముల రజనీ కుమార్, బోనంనాని, మహ్మద్ జానీ పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న హబీబ్ బాషా

టి.నర్సాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధి కారి హబీబ్ బాషా హెచ్చరించారు. స్థానిక వెంకటేశ్వర ఎరువుల దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేసి ఎరువుల నిల్వలను స్టాక్‌రిజి స్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో ఈ-పంట నమోదు పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూరుశాతం ఈ-పంట నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ సుబ్బారావు, గ్రామవ్యవసాయ, ఉద్యానవన సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైక్లిస్టు మృతి



దుర్గా ప్రసాద్ మృతదేహం

మొగల్తూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):వేగంగా బైక్ నడుపుతూ చెట్టును ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలవ్వడంతో ఆసుపత్రికి తరలించారు. ఆదివారం సాయంత్రం పేరుపాలెం బీచ్ రోడ్డులో జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన మల్లుల దుర్గా ప్రసాద్ (23) కుడుపూడి సాయికృష్ణ, కవురు ప్రవీణ్‌లు బీచ్‌కు వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి మార్గమధ్యలో కొబ్బరి చెట్టును ఢీకొట్టడంతో దుర్గా ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రవీణ్‌కు తీవ్రగాయాలపాలవ్వడంతో పాలకొల్లు ఆసుపత్రికి తరలించినట్టు తెలిసింది. ఈసంఘటనలో మృతి చెందిన దుర్గా ప్రసాద్‌ను నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్ట్‌మార్టం కోసం తరలించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మొగల్తూరు ఎస్ఐ వై.నాగలక్ష్మీ తెలిపారు.

లారీ ఢీకొని బాలుడి మృతి

ఆకివీడు రూరల్ అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గుమ్ములూరు గ్రామంలో లారీ ఢీకొని బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన మల్లాడి మౌనిష్‌శ్రీసాయి(10) ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఇంటి వద్ద నుంచి ట్యూషన్‌కు సైకిల్‌మీద వెళుతుండగా ఆకివీడు నుంచి చినకాపవరం వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో అతను అక్కడిక్కక్కడే మృతి చెందాడు. బాలుడు ఆకివీడులోని ఒక ప్రైవేటు స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. మల్లాడి వీరన్న, జ్యోతిల ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో ఆప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కొద్దిసేపు ఆకివీడు-గణపవరం రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ఏఎస్ఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ఏఈ నరసింహారావు సేకరించిన పురాతన కాయిన్సు, స్టాంపులు, అగ్గిపెట్టెలు

సరికొత్తగా..

• ఓల్డ్ ఈజ్ గ్రేట్

పురాతన వస్తువులంటే ఎంతో ఇష్టం : భీమనాథం వెంకట నరసింహారావు

వృత్తి హౌసింగ్ ఏఈ... ప్రవృత్తి నాణేలు, స్టాంపులు, అగ్గిపెట్టెల సేకరణ



ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి రామానాయుడు, తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ, కలెక్టర్ నాగరాణి (ఫైల్)



పాలకోడేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తిలో ఓ నైపుణ్యత దాగి ఉంటుంది. దానిని వెలికితీసుకువచ్చిన వారే విజయం సాధిస్తారు. ఆ కోవలోకే వస్తారు పాలకోడేరు మండలంలోని హౌసింగ్ ఏఈగా పని చేస్తున్న భీమనాథం వెంకట నరసింహారావు. ఆయన స్వగ్రామం భీమవరం. ఉద్యోగ రీత్యా భీమవరం, ఏలూరు, కృష్ణా జిల్లా, నెల్లూరు జిల్లాలతోపాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో హౌసింగ్ ఏఈగా పని చేశారు. ఆయన వృత్తిలో ఎంత నిబద్ధతతో పనిచేస్తారో అదే నిబద్ధతతో స్టాంపులు సేకరణ, పురాతన నాణేల సేకరణ, పురాతన స్టాంపులు సేకరణ అంటే ఎంతో ఇష్టం. చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. ఆ రోజుల్లో ఇంటి పక్కనే నివసిస్తున్న బ్యాంకు ఉద్యోగి గృహంలో మ్యాగజైన్లు చదువుతూ వాటిలో వచ్చిన క్రికెట్ క్రీడాకారుల ఫొటోలు చిన్నప్పటి నుంచి కట్ చేసి దాచుకోవడం అలవాటుగా మారింది. ఈ అలవాటు కాస్తా 1977 సంవత్సరంలో ఏడో తరగతి చదువుతుండగా క్రికెట్ క్రీడాకారులతో పాటు అగ్గిపెట్టెలను సేకరించడం కూడా మొదలుపెట్టారు. ఇదే కాకుండా అణా కాయిన్ నుంచి ప్రస్తుతం వెయ్యి రూపాయల కాయిన్ వరకు నాణేల సేకరించడాన్ని అలవాటుగా మార్చుకున్నారు. మన దేశానికి చెందిన పురాతన నాణేలనే కాకుండా 106 దేశాలకు చెందిన పలు రకాల నాణేలను సేకరించారు. 60 దేశాలకు చెందిన స్టాంపులను సైతం జాగ్రత్త చేశారు. పూర్వకాలంలో లభించే పలు రకాల అగ్గిపెట్టెలను సైతం ఎంతో భద్రంగా దాచి పెడుతూ భవిష్యత్ తరాల వారికి అప్పట్లో వాడుకలో ఉండే వాటిని తెలియపరిచే విధంగా సేకరించారు. పెద్ద పెద్ద కార్యక్రమాలు జరిగేటప్పుడు, రిపబ్లిక్ డే సమయాల్లో, ఎగ్జిబిషన్ సమయాల్లో ఎక్కువ మంది ప్రజలు వచ్చే ప్రాంతంలో ఒక టెంట్ వేయించుకుని వీటి ప్రాముఖ్యతను తెలిపే విధంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. క్రికెట్ మీద మక్కువతో 1983లో వరల్డ్ కప్ గెలిచిన క్రికెట్ క్రీడాకారుల సంతకాలతో ఉన్న బ్యాట్‌ను సైతం ఆయన నేటి వరకు భద్రపరుస్తూ వచ్చారు.

పని చేసేది హౌసింగ్ ఏఈ అయినప్పటికీ ఈయన భవిష్యత్ తరాలకు నాణేలు, కరెన్సీ, స్టాంపులు, అగ్గిపెట్టెలు భద్రపరచి శభాశ్ అనిపించుకుంటున్నారు.

అవార్డులు, రివార్డుల కోసం కాదు..



రివార్డులు, అవార్డులు సాధించడానికి ఈ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడం లేదు. చిన్నప్పటి నుంచి పురాతన వస్తువులు సేకరించడం హాబీగా మారింది. ఆ ఇష్టంతోనే 106 దేశాలకు చెందిన నాణేలు, కరెన్సీ నోట్లు, స్టాంపులు, అగ్గిపెట్టెలు సేకరించా. ఎంతో సంతృప్తినిచ్చింది. కలెక్టర్, మంత్రులు, ఆర్డీవో, ఎమ్మెల్యేలు.. ఇలా చాలా మంది అభినందించడం మరింత బలాన్నిచ్చింది.

- భీమనాథం వెంకట నరసింహారావు, పాలకోడేరు హౌసింగ్ ఏఈ

బాస్కెట్ బాల్ జిల్లా మహిళా జట్టు ఎంపిక



ఏలూరు రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మహిళల జట్టు ఎంపిక పోటీలను ఆదివారం స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 60 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు కె. కృష్ణారావు, గవ్వ శ్రీనివాస్‌రావు తెలిపారు. బి. లీలావతి, బి. భవానిదేవి, ఎ. టాలీ అనిత, జి నాగదేవి, టి. జ్యోతి, పి. నాగ వినయశ్రీ, పి. ప్రవల్లిక, పి. జయశ్రీ, ఆర్. మహతి, వి. నిఖిలా రెడ్డి, ఎం. నీరజ, లాస్య, డి. సాయి భవాని, పి. నందిని, ఎ. పూర్ణ చంద్రిక, వి. యామిని ఎంపికయ్యారు. వీరు నవంబరు 7 నుంచి 10 వరకు విశాఖలో జరగబోయే 7వ ఏపీ అంతర్ జిల్లాల సీనియర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని కోచ్ మురళీకృష్ణ తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్స్ కె మాధవిలత, సాంబశివరావు, సురేష్, సీనియర్ ప్లేయర్స్ నగేష్‌రెడ్డి, సుధాకర్, వెలగ సత్యం పర్యవేక్షించారు.

గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నేటి నుంచి 29 వరకు ఆలయం మూత

బుట్టాయగూడెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీ మన్యం అటవీ ప్రాంతంలో వేంచేసి ఉన్న అడవి బిడ్డల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మను ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు అమ్మవారి ఆలయాన్ని మూసివేస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.




శ్రీవారి క్షేత్రంలో మారేడు వృక్షం.. (పక్కన) ఏకబిల్వ పత్రం

ఏకబిల్వం శివార్పణం..

మహేశ్వర ప్రీతిపాత్రం... బిల్వపత్రం

శేషాచలంపై బిల్వ వృక్షాలు



ద్వారకాతిరుమల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పరమేశ్వరుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసంలో రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేస్తూ భక్తులు ఆ దేవదేవుని అనుగ్రహం కోసం పరితపిస్తారు. బిల్వ దళాన్ని త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ప్రతిరూపంగా భావిస్తారు.

అఖండ బిల్వపత్రం చ అయుతం శివపూజనం..
కృతం నామ సహస్రేణ.... ఏకబిల్వం శివార్పణం

అంటూ ఆ మహాదేవుని పూజిస్తారు. ఈ త్రిదళ బిల్వ పత్రంలో కుడివైపు విష్ణువు, ఎడమవైపు బ్రహ్మ, మధ్యలో శివుడు కొలువై ఉంటాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ త్రిబిల్వం మహాదేవుని త్రినేత్రాలను, లేదా ఆయన ఆయుధం త్రిశూలాన్ని సూచిస్తాయని కూడా అంటారు. ఈ బిల్వపత్రాలు చాలా రకాలున్నాయి. ఏకబిల్వం, త్రిబిల్వం, సప్తబిల్వం, షణ్ముఖ బిల్వం. పంచముఖ బిల్వం, అఖండ బిల్వం. మారేడుకు శివప్రియ అనే మరోపేరు ఉంది.. బిల్వపత్రాన్ని తెలుగులో మారేడుగా పిలుస్తారు. శివుడు ఈ మారేడు చెట్టుకింద నివాసం ఉంటాడని పండితులు చెబుతున్నారు. పరమేశ్వరుని సోదరి అయిన మహాలక్ష్మి హృదయం నుంచి మారేడు దళాలు ఆవిర్భవించాయని అందుకే ఆ దళం శివయ్యకు అత్యంత ప్రీతిపాత్రమని చెబుతారు. బిల్వ వృక్షాల విశిష్టతను దృష్టిలో ఉంచుకుని ద్వారకా తిరుమల శ్రీవారి శేషాచలకొండపై వీటిని ఎంతో శ్రద్ధగా పెంచుతున్నారు. ముఖ్యంగా క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయ ఆవరణలో ఏకబిల్వం, మహాబిల్వం మొక్కలను నాటి పోషిస్తున్నారు. అరుదుగా లభించే మహాబిల్వం మొక్కను ప్రత్యేకంగా అరుణాచల ప్రదేశ్ నుంచి తెచ్చి నాటారు. క్షేత్రంలో ఈ బిల్వవృక్షాలకు కొదవలేదు. బిల్వ పత్రాలతో తనను పూజిస్తే శనీశ్వరుని బాధ ఉండదని శివుడే తన భక్తులకు అభయమిచ్చాడట. లక్ష్మీదేవి తపోఃఫలితంగా బిల్వవృక్షం పుట్టిందని అందుకే ఆమెను బిల్వ నిలయా అని పిలుస్తారు. శ్రీ అంటే బిల్వమని, మారేడు చెట్లు విస్తారంగా ఉండటం వల్లే శ్రీశైలం అనే పేరు వచ్చినట్లు చెబుతారు. బిల్వపత్రాల్లో ఎన్నో ఔషధ గుణాలున్నాయట. ఇంటి ఆవరణలోనూ మారేడును నిరభ్యంతరంగా పెంచుకోవచ్చునని పండితులు చెబుతారు.




అరుణాచలం నుంచి తెచ్చిన అరుదైన మహాబిల్వం మొక్క.. (పక్కన)మహాబిల్వ పత్రం

పచ్చని కాపురంలో చిచ్చు

» వేరే వ్యక్తితో భార్య వివాహేతర సంబంధం

» విషం తాగిన భార్య, భర్తలు.. పరిస్థితి విషమం

భీమడోలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అక్రమ సంబంధం పచ్చని కాపురంలో నిప్పుపెట్టింది. భార్యా భర్తల మధ్య కలతలు రావడంతో సూసైడ్ నోటు రాసి విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన భీమడోలులో జరిగింది. భీమడోలు గ్రామానికి చెందిన గుండమోలు సుధాకర్, భాను పూర్ణిమ ఐదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి మూడేళ్ల బాబు కూడా ఉన్నాడు. వీరి కాపురం సాఫీగా సాగిపోతున్న సమయంలో ఐదు నెలల క్రితం భార్య భాను పూర్ణిమకు భీమడోలు గ్రామానికి చెందిన కఠారి మోహన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో 6వ తేదీన భాను పూర్ణిమ, మోహన్‌తో కలిసి వేరే ప్రాంతానికి వెళ్లిపోయింది.. మళ్లీ 19న వీరిద్దరూ తిరిగి వచ్చారు. దీంతో పోలీసులు భర్త సుధార్‌తో పాటు వారిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం భాను పూర్ణిమ పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో అవమానభారంతో భర్త, తప్పు చేశాననే బాధతో భార్య ఇద్దరూ మనస్థాపం చెంది 25వ తేదీన విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వీరిని గుంటూరు తరలించారు. దీనిపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాయ చేసి తీసుకెళ్లాడు: భాను పూర్ణిమ

కఠారి మోహన్ అనే వ్యక్తి తనను మాయ చేసి తీసుకెళ్లాడని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. మోహన్ అనే వ్యక్తికి అమ్మవారి పూనకం వస్తుందని పలుమార్లు తనకు ఏదో కలిపిన కుంకుమ ఇచ్చి మాయ చేశాడంటూ భాను పూర్ణిమ పేర్కొంది. ఈ కేసుపై భీమడోలు పోలీసులు తమను పట్టించుకోలేదని న్యాయం చేయాలంటూ ఆరోపించింది.

ఏలూరులో గంగానమ్మ జాతర ప్రారంభం

» మూడు నెలల పాటు శుభకార్యాలకు ప్రజలు దూరం

ఏలూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఏలూరులో గంగానమ్మ జాతర మహోత్సవంగా ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఏడేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతరను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఆయన సతీమణి మీనాకుమారి, మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతుల ఆధ్వర్యంలో పడమర వీధి వేదికగా జరిగే ఈ జాతరకు వంగాయగూడెం వినుకొండ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ముడుపు కట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పందిరి రాట వేశారు. నవంబరు 5వ తేదీ నుంచి అమ్మవార్లకు స్నానాలు ఆచరింపు చేసి ఘట ఆవాహనం చేస్తారు. ఆదివారం మొదలుకుని ఫిబ్రవరి రెండో తేదీ వరకు మూడు నెలల పాటు ఏలూరు కేంద్రంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలేమీ చేయరు. జాతర సమయంలో పొలిమేర కూడా దాటకూడదని చెబుతుంటారు. జాతర జరిగే సమయంలో ప్రజలు ఏ ఆలయంలోను మొక్కులు తీర్చుకోరు. తిరుపతి, అన్నవరం వంటి క్షేత్రాల్లోనూ మొక్కులున్నా జాతర తర్వాతే చెల్లించుకుంటారు. 1995 నుంచి ఈ జాతర సంప్రదాయం కొనసాగుతోంది. తొలుత 12 ఏళ్లకు మధ్యలో 11 ఏళ్లు, 2004 నుంచి ఏడేళ్లకు ఒకసారి ఈ జాతర చేయడం ఆనవాయితీగా వస్తోంది. ముగింపు రోజు దూరపు బంధువులను ఇంటికి ఆహ్వానించి పిండి వంటలు, నాన్‌వెజ్ వడ్డిస్తారు. తాహతు ఉన్నవారు నూతన వస్త్రాలు ఇంటిళ్లపాది పెడుతుంటారు. ఒకప్పుడు ఊరంతా కలిసి జాతరను నిర్వహించేవారు.. ఇప్పుడు తూర్పు వీధి, దక్షిణపు వీధి, పవర్ పేట, ఆదివారపుపేటలోనూ ఈ జాతరను విడివిడిగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



ముడుపు తీసుకువెళ్తున్న ఏలూరు ఎమ్మెల్యే చంటి

మార్కెట్‌లోకి నాఫెడ్ ఉల్లి

మహారాష్ట్ర నుంచి 90 టన్నుల రాక

క్వింటా రూ.1000 నుంచి 1500




మార్కెట్‌లో ఉన్న ఉల్లిపాయలు, కూరగాయలు

తాడేపల్లిగూడెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్)నుంచి ఉల్లి వచ్చింది. భారత దేశంలో వ్యవసాయ ఉత్పత్తు మార్కెంటింగ్ సహకార సంస్థల అత్యున్నత సంస్థ ఈ నాఫెడ్. ఈ సంస్థ ద్వారా మార్కెట్‌కు ఉల్లిని సరఫరా చేస్తున్నారు. ఇప్పుడు మార్కెట్లోకి ఈ సంస్థ సరఫరా చేసే ఉల్లి వచ్చింది. ఇది మహారాష్ట్ర నుంచి వచ్చింది. ఆదివారం మార్కెట్లోకి మూడు లారీలో 90 టన్నులు వచ్చింది. దీని ధర క్వింటా రూ.1000 నుంచి 1500 మధ్య ఉంది. సాధారణంగా దీపావళి పురస్కరించుకుని మహారాష్ట్రలో నాలుగు రోజుల పాటు సెలవులు ఉంటాయి. ఈ సమయంలో అక్కడ ఉండే వ్యాపారులు ఉల్లి వ్యాపారం చేయరు. దీంతో ఇప్పుడు మార్కెట్ కొరతను నివారించేందుకు నాఫెడ్ ఉల్లిని మార్కెట్లకు పంపుతుంది.

కర్నూలు, కడప నుంచి ఆగింది..

మార్కెట్లో కడప, కర్నూలు రకం ఉల్లి రావడం ఆగింది. ఈ ఏడాది కడప, కర్నూలు ప్రాంతాల్లో ఉల్లి సాగును విస్తారంగా వేశారు. అకాల వర్షాలతో అక్కడ ఉల్లి దెబ్బతింది. దీంతో ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1200కు కొనుగోలు చేసి ఆదుకుంది. ప్రభుత్వం కొనుగోలు చేసిన ఈ ఉల్లిని హాస్టళ్లకు, చౌకడిపోల్లోను, రైతు బజారులోను అమ్మించారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసి ఇతర మార్కెట్లకు తరలించే సందర్భంలో ఉల్లి దెబ్బతినడంతో టన్నులకొద్ది ఉల్లిని పారబోశారు. ఈ సంవత్సరం ఉల్లి సాగు చేసిన రైతుల కంట కన్నీరు మిగిలింది. గత సంవత్సరం కర్నూలు, కడపలో సాగు చేసిన ఉల్లి తాడేపల్లిగూడెం మార్కెట్లో క్వింటా రూ.4500నుంచి 6000 మధ్య ధర పలికింది. దీంతో కడప, కర్నూలు ప్రాంతాల్లో ఉల్లిని గణనీయంగా సాగు చేశారు. దీంతో ఉల్లి దిగుబడి పెరిగి ధర పడిపోయింది.కొంత మంది రైతులు ఉల్లి సాగు ఖర్చులు కూడా రావడం లేదని పొలాల్లో పశువులను మేపారు. ఇలాంటి గడ్డు పరిస్థితి గతంలో ఎన్నడూ రాలేదు.

మండుతున్న కూరగాయల ధరలు..

మార్కెట్లో ఇప్పుడు కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కార్తీక మాసం మొదలు కావడంతో దీని ప్రభావంతో కూరగాయల ధరలు పెరగడం ఒక కారణమైతే.. వాతావరణంలో వచ్చిన మార్పుతో కూరగాయల దిగుబడి తగ్గి ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. కిలో రూ.20 కూడా పలకని బెండకాయలు ఏకంగా రూ.50 చేరాయి. దొండకాయలు రూ.50, క్యారెట్ గత వారం కిలో రూ.50 ఉంటే ఈవారం రూ.70, బీట్ ధర గత వారం కిలో రూ.50 ఉంటే ఈ వారం రూ.80లకు పెరిగింది. బీరకాయలు రూ.50, కాకర రూ.60, బంగాళా దుంపలు రూ.40, వంకాయలు రూ.80, టమాటా రూ.40, చిక్కుళ్లు రూ.120, పచ్చిమిర్చి రూ.50 విక్రయించారు. రిటైల్‌గా ఉల్లి రూ.100లకు 4కేజీలు, 5కేజీలు వంతున అమ్మారు. కడప, కర్నూలు రకాలను మహారాష్ట్ర రకంతో కలిపి ఆటోల్లో రూ.100కు 5 కిలోలు, 6కిలోలు వంతున విక్రయించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భారతి

భక్తురాలికి పాము కాటు

ఏలూరు ఆసుపత్రికి తరలింపు

ద్వారకాతిరుమల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అన్నదానానికి వెళ్లి భోజనం చేసి నడిచి వస్తున్న ఓ భక్తురాలి చేతిపై ఆదివారం రాత్రి కట్లపాము కాటు వేసింది. దీంతో ఆమె తీవ్ర భయాందోళనలకు గురికావడంతో స్థానికులు ఆమెను ముందుగా పీహెచ్‌సీకి అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చాట్రాయి మండలం చిన్నంపేటకు చెందిన అన్నపురెడ్డి భారతి ఆదివారం మరో కొందరు భక్తులతో కలిసి ద్వారకాతిరుమల వచ్చిస్వామి, అమ్మవార్ల దర్శనానంతరం రాత్రి అన్నదాన సదనంలో భోజనం చేసింది. అనంతరం పాత కేశఖండనశాల వద్ద ఉన్న మెట్ల మార్గం గుండా వస్తోంది. మెట్లు దిగుతూ అక్కడున్న గట్టుపై చేయి వేసింది. గట్టుపై ఉన్న కట్ల పాము భారతి చేతిపై కాటు వేసింది. పీహెచ్‌సీలో వాక్సిన్ వేయించుకున్న అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆమెను ఏలూరు తరలించారు.

నేడు సొసైటీ ఉద్యోగుల ఆందోళన



జిల్లాలో ఉన్న డీసీసీబీ కార్యాలయం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో పని చేస్తున్న సొసైటీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలపై సోమవారం పోరుబాట చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో 1400 మంది ఉద్యోగులు మూకుమ్మడి సెలవులు పెట్టి.. కార్యాలయాలను బంద్ పాటించనున్నారు. విజయవాడలో ఆప్కాబ్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొంటారు. ప్రధానంగా 2019 నుంచి పెండింగ్‌లో పీఆర్‌సీ ఇవ్వాలని వేతనాలు పెంచాలని, పాత బకాయిలు ఇవ్వాలని, ఇతరశాఖల ఉద్యోగుల మాదిరిగా 62 ఏళ్ల వయో పరిమితి అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్లతో ఆందోళనకు ఉప క్రమిస్తున్నారు. తమకు విధిగా చాలా కాలం నుంచి సర్వీసు రూల్స్ అమలు చేయడం లేదని, సొసైటీల నిర్వహణతోనే డీసీసీబీ నిర్వహణ జరుగుతున్నా తమకు పదోన్నతుల కల్పనలో పట్టించుకోవడం లేదని వారు చాలా కాలం నుంచి డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతున్నారు. వాస్తవంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో ఖాళీ ఏర్పడిన చోట్ల 25 శాతం సొసైటీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాల్సి ఉంది. అది కూడా సక్రమంగా జరగడం లేదని యూనియన్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సహకార సంఘాల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

భారం పెంపుపైన ఆందోళన..

ఇదిలా ఉండగా 2019 నుంచి విధుల్లో చేరినవార్ని రెగ్యులరైజ్ చేయలేదు. ఉమ్మడి జిల్లాలో 150 పైగా ఈ తరహా ఉద్యోగులు ఉంటారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న సమయంలోను సొసైటీ ఉద్యోగులే కొనుగోలు కేంద్రాలకు కంప్యూటర్లు సమకూర్చడంతో పాటు అక్కడ సిబ్బంది ఇవ్వాల్సి ఉంది. ధాన్యం పట్టుబడి గోనే సంచులను కూడా అందివ్వడం లేదని చెబుతున్నారు. దీంతో రోజువారి సొసైటీల నిర్వహణ కుంటుపడుతోందని వారు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు సొసైటీల కంప్యూటరీకరణ చేసిన ఇంకా ఆయా సొసైటీల ఉద్యోగులకు పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వనేలేదు. దీంతో పని భారం పెరిగిందని వారు ఆందోళన చెందుతున్నారు. త్రిసభ్య కమిటీ చైర్మన్లు ధర్నాలో పాల్గొననున్నట్లు ముందస్తు సమాచారంతో సొసైటీ ఉద్యోగులు సైతం ఆందోళనకు ఉపక్రమిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ మారుతీనగర్‌కు చెందిన సుందరమితి దుర్గారావు(35)కు భార్య, పిల్లలు ఉన్నారు. అతని తల్లి దండ్రుల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆ ఇంటిపై అప్పు ఉండడంతో కుటుంబం మధ్య కలహాలు ప్రారంభమయ్యాయి. దీంతో దుర్గారావు భార్య తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్థాపానికి చెందిన దుర్గారావు ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ బి నాగ బాబు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి ఆదివారం తరలించారు.

ఆర్యవైశ్య కార్తీక వనసమారాధన

భీమవరం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో ఆదివారం శ్రీవాసవి ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన నిర్వహించారు. ముందుగా కార్తీక దామోదర పూజ, నవ చండీ పారాయణ, సామూహిక కుంకుమార్చనలు, 54 మంది దంపతులచే చండీ హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.శ్రీవాసవి ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన సేవా సంఘం ప్రెసిడెంట్ చక్కా సుబ్బారావు, సెక్రటరీ టంగుటూరి ఆది వెంకట నారాయణ, నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాచేనమ్మకు భక్తుల తాకిడి

ఆచంట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి ఆదివారం కావడంతో ప్రసిద్ధి చెందిన పెదమల్లం మాచేనమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు ఆలయ అధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ, చైర్మన్ బోడపాటి బాబులు సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మనిషి మెదడు సూపర్ కంప్యూటర్


మాట్లాడుతున్న క్లినికల్ సైకాలజిస్టు రామకృష్ణ

తణుకు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):మనిషి మెదడు వంద సూపర్ కంప్యూటర్లతో సమానవమని ఇటీవల అధ్యయనంలో తేలిందని క్లినికల్ సైకాలజిస్టు యనమండ్ర రామకృష్ణ అన్నారు. ఆదివారం సాయంత్రం రోటరీ క్లబ్‌లో ట్రైన్ యువర్ బ్రెయిన్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. కొంతమంది పిల్లలు తమ విద్యలో అనుకున్న ఫలితాలు సాధించలేకపోవడానికి మెదడు వాడకంలో అవగాహన లేక విఫలం కావడమేనని చెప్పారు. సమాజంలో తెలివైన వారు, తెలివి తక్కువ వారు అని రెండు వర్గాలు ఉండరని, అందరికి బ్రెయిన్‌కు ఇంచుమించు ఒకే సామర్థ్యం ఉందని వివరించారు. ఇది శాస్త్రీయ పరిశోధనలలో కూడా రుజువు కాబడిందని పేర్కొన్నారు. నిజానికి శిక్షణ పొందినవారు, శిక్షణ పొందని వారు అనే రెండు రకాలుగా చెప్పవచ్చని అన్నారు. బ్రెయిన్, మైండు ఈ రెండింటికి సరైన శిక్షణ అవసరమని, అది ప్రామాణిక పద్ధతుల్లో పొందలేకపోవడం వల్లనే జీవితంలో కొంతమంది విజయాలు సాధించలేక పోతున్నారని చెప్పారు. పిల్లలకు మెకానిక్ పద్ధతుల్లో (బట్టీపట్టే విధానం) కాకుండా తార్కిక పద్ధతుల్లో విద్యను అందించాలని, దీనివల్ల పిల్లలకు విద్యపట్ల ఆసక్తి పెరుగుతుందని వివరించారు. ఏకాగ్రత పెరగడం, మెమరీ పెరగడం, బద్ధకం, ఎలక్ట్రానిక్ ఎడిక్షన్‌ను అధిగమించడానికి వీలుగా త్వరలో శిక్షణ తరగతులు పిల్లల కోసం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆసక్తి గలవారు 9966228918 కు సంప్రదించ్చవచ్చని తెలిపారు. ఇది ఉచితంగానే ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కలగర వెంకట కృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి):సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా వృద్ధులకు సంచార శకటం ద్వారా వైద్య సేవలు ఆదివారం ప్రముఖ వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య అందించారు. తణుకు, మండపాక గ్రామాల్లో పర్యటించి ఏడుగురు వృద్ధులకు వైద్య సేవలందించారు. సభ్యులు అక్కిన కాశీ విశ్వనాథం ఆర్థిక సాయంతో ఉచితంగా మదులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, గిరజాల నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అలంపురంలో ఘనంగా సత్యసాయి వ్రతాలు


పూజలు చేస్తున్న డాక్టర్ బంగార్రాజు

పెంటపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా అలంపురం శ్రీసత్యసాయి రామానందయోగి రావమ్మ కళా కేంద్రంలో ప్రవాస భారతీయుడు కొలనువాడ బంగార్రాజు ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక సత్యసాయి వ్రతాలు నిర్వహించారు. సుమారు 500 మంది వ్రతాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. వ్రతాల్లో పాల్గొన్న భక్తులకు సత్యసాయి ఫొటోలతో పాటు ఉచితంగా పూజా సామగ్రిని అందజేశారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో వెంకట రమణ సేవా చారిటబుల్ ట్రస్టు అధినేత కొలనువాడ పెదకృష్ణంరాజు, సత్యసాయి సేవాసమితి సభ్యులు ఆకుల నవీన్‌బాబా, పాలూరి రాంబాబు పాల్గొన్నారు.

మొంథా ఫియర్

(5వ పేజీ తరువాయి)

భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో తుఫాన్‌లు సృష్టించిన విలయాలు, ప్రాణ, ఆస్తి నష్టాలు ప్రజల ముందు కనబడుతున్నాయి. మొంథా తుఫాన్ మచిలీ పట్టణం, కాకినాడ మధ్య తీరం దాటవచ్చనే హెచ్చరికలు కోస్తా ప్రాంత రైతులను మరింత కలవరపాటుకు గురి చేస్తున్నాయి. గతంలో 1991 మేలో సంభవించిన తుఫాన్, 1996 నవంబరు 6న సంభవించిన తుఫాన్ విలయాలు ఈ ప్రాంత రైతులు మర్చిపోలేదు. ఈ రెండు తుఫాన్‌లు కాకినాడ తీరం వద్దే దాటడంతో జరిగిన వరి, కొబ్బరి, కోకో పంటల నష్టంతో పాటు కోళ్ల పరిశ్రమకు జరిగిన నష్టాలు రైతుల కళ్లల్లో కదలాడుతూనే వున్నాయి.

ప్రభావం ఎక్కువ...

ఈశాన్య రుతుపవన కాలంలో సంభవించే తుఫాన్‌లు నైరుతు పవన కాలంలో వీచే తుఫాన్‌ల కంటే ఎక్కువ ప్రభావం చూపుతాయి. నైరుతి వపన కాలంలో ఒండ్రు మట్టితో కూడిన నీటిలో కంటే ఈశాన్య రుతు పవన కాలంలో బంగాళాఖాతంలో ప్రవహించే స్వచ్ఛమైన నీటిలో వడి ఎక్కువగా వుంటుంది. ఫలితంగా ఆ వడి ప్రభావం భూమి ఉపరితలంపైకి బలంగా గాలులు వీయడంతో చెట్లు ఎక్కువగా కూలిపోతాయి. వీటితో తోట పంటలు, నివాస గృహాలు ఎక్కువగా కూలిపోతాయి.

పునరావాస కేంద్రాల్లో ఆర్డీవో, జేసీ పరిశీలన


కెపిపాలెం పునరావాస కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో

మొగల్తూరు మండలంలోని తీర గ్రామాలైన కేపీపాలెం, పేరుపాలెం ఉన్నత పాఠశాలలతో పాటు, మెట్రేవు, మోళ్ళపర్రు, లైన్ పల్లవపాలెం, పాతపాడు గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మొగల్తూరు తహసీల్దార్ రాజ్‌కిషోర్ తెలిపారు. ఆయా పునరావాస కేంద్రాలను నరసాపురం ఆర్డీవో దాసిరాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి పరిశీలించి అన్ని శాఖల అధికారులు తుఫాన్ ఏవిధంగా సంబవించినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో లోతట్టు ప్రాంత ప్రజలను తరలిస్తే వారికి ఆహారం అందించేందుకు వంట గ్యాస్, కూరగాయలు, నిత్యావసరాలు, పాలు, పండ్లు సిద్ధం చేశారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో మొత్తం 16 పునరావస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో నరసాపురంలో 8, మొగల్తూరు మండలంలో 8 కేంద్రాలు ఉన్నాయి. సోమవారం నుంచి ఈ కేంద్రాల్లోకి తీర గ్రామ ప్రజల్ని తరలించనున్నట్లు ఆర్డీవో దాసిరాజు తెలిపారు. నరసాపురంలో మండలంలోని తూర్పుతాళ్ళు గ్రామంలో రెండు, వేములదీవి ఈస్ట్, వెస్ట్ గ్రామాల్లో ఐదు, లక్ష్మణేశ్వరంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

కొల్లేరు వరదను పరిశీలించిన కలెక్టర్ సెల్వి

మండవల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో కొల్లేరు వరద ఉధృతిని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదివారం పరిశీలించారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా తూడు గుర్రపుడెక్కను తొలగించాలని అధికారులను ఆదేశించారు. పెద్దఎడ్లగాడి-పెనుమాకలంక రోడ్డు మునిగిపోవడంతో గ్రామస్థులు రోడ్డు వేయించేలా ఏర్పాటు చేయాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో కొల్లేరు పరిసర ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పర్యాటక బోట్ల బంద్

పోలవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో లాంచీలు, పాపికొండల పర్యాటక బోట్లు నిలిపివేయాలని డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం రేవులను ఆదివారం ఆయన పరిశీలించి పర్యాటక బోట్ల నిర్వాహకులు, పట్టిసీమ పురుషోత్తపట్నం రేవు లాంచీల యజమానులకు హెచ్చరికలు చేశారు. తుఫాన్ ప్రభావం తగ్గేవరకూ లాంచీలు, బోట్లు నదిలో రాకపోకలు సాగించరాదని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్తీక మాసం పుణ్య స్నానాలు చేసే భక్తులు నదిలో స్నానాలకు ఉపక్రమించరాదని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. గుంజవరం, తానాలకుంట, రేపల్లెవాడ, ప్రగడపల్లి గ్రామాల పరిధిలో కొండవాగులు కాలువలు దాటే ప్రయత్నాలు చేయరాదన్నారు. ఆయన వెంట సీఐ బాల సురేశ్, ఎస్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఏఎంసీ పాలకవర్గం.. మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కష్టపడే ప్రతి కార్యకర్తకు కూటమిలో గుర్తింపు

అట్టహాసంగా నరసాపురం ఏఎంసీ ప్రమాణ స్వీకారం

నరసాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కూటమిలో కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం అల్లూరి కల్యాణ మండపంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులు గంగధర్ ప్రమాణ స్వీకారోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా మూడు పార్టీల ఐక్యత చాలా ముఖ్యమన్నారు. ప్రజలు, కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు వైసీపీ ప్రయత్నిస్తుందని, దీన్ని కూటమి నాయకులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ అరుంధతి సినిమాలోని పశుపతి లాంటోడని, అటువంటి భూతాన్ని సీసాలోనే ఉంచాలన్నారు. మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం సర్వనాశనం అవ్వడం ఖాయమన్నారు. విప్ నాయకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడే కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. టీడీపీ ఇన్‌చార్జి రామరాజు మాట్లాడుతూ రైతుల ఆశయాలకు అనుగుణంగా మార్కెట్ కమిటీ పని చేయాలన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, వంగవీటి రాధ, జాన కీరామ్, కార్పొరేషన్ చైర్మన్లు రామరాజు, పీతల సుజాత, షరీఫ్, కొల్లు పెద్దిరాజు, చాగంటి చిన్న, ఆకాశపు శంకర్, వలవల బాబ్జీ ప్రసంగించారు. అనంతరం మంత్రుల్ని ఘనంగా సత్కరించారు. పాలకవర్గ సభ్యుల చేత ఏఎంసీ కార్యదర్శి ప్రమాణ స్వీకారం చేయించారు. అగ్నికులక్షత్రీయ రాష్ట్ర సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవి, మైలా వసంతరావు, వాతాడి ఉమా, డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, సంకు భాస్కర్, జోగి పండు, గుబ్బల నాగరాజు, పాలూరి బాబ్జీ పాల్గొన్నారు.

తుఫాన్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు పట్టణ ప్రజలను కోరారు. ఈ మేరకు ఆదివారం మునిసిపల్ కార్యాలయం నుంచి ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ తుఫాన్ ప్రభావంతో ఈనెల 27, 28, 29 తేదీలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గాలి, వాన ప్రభావం ఉండటం వల్ల ఎవ్వరూ ఇంటినుంచి బయటకు రాకూడదన్నారు. వర్షం, గాలి వీచే సమయంలో కరెంట్ స్తంబాలు, పబ్లిసిటీ హోర్డింగ్స్, చెట్టు కింద ఉండకూడదని, కరెంట్ లేనప్పుడు, నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తగినంత నీటిని నిలువ చేసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో తాడేపల్లిగూడెంలో మునిసిపాలిటీలో ఏర్పాటు చేసిన కంట్రోల్ నంబర్ 08818-224188 సంప్రదించాలని కోరారు.

పాలకొల్లు అర్బన్: రానున్న 4రోజులు భారీ తుఫాన్ సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను వాయిదా వేసినట్టు తెలిపారు. అవసరమైతే 73962 31927 ఫోన్ నెంబరుకు సమాచారం అందించాలని తెలిపారు.

ఆకివీడు: మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం నుంచి భారీ వర్షాలు పడనున్న నేపథ్యంలో అన్ని చర్యలు చేపట్టామని తహసీల్దార్ ఫరూఖ్ తెలిపారు. అవసరం మేర పునరావాసాలకు సన్నద్ధం చేశామన్నారు. ప్రజానీకం, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అత్తిలి:మండలంలోని 19 పునరవాస కేంద్రాలను గుర్తించినట్లు అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో తుఫాన్ ముందస్తు చర్యలపై సమావేశాన్ని నిర్వహించారు. 28న 176 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగలదని భావిస్తున్నట్లు తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో ప్రయాణాలు వాయిదే వేసుకోవాలని కోరారు. మండలంలో 19 మంది గర్భిణులను గుర్తించామని వారిని ఆసుపత్రులలో చేర్చాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, సచివాలయ ఉద్యోగుల సెలవులను రద్దు చేసినట్లు తెలిపారు. అత్తిలిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు. అనంతరం తహసీల్దార్ దశిక వంశీ తిరుపతిపురం, వరిగేడు, స్కిన్నెరపురం గ్రామాలలో పర్యటించారు.

పెనుమంట్ర:ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వై.రవికుమార్ హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, ఎటువంటి ప్రాణనాష్టం కలగకుండా మండల కేంద్రాల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బలమైన ఈదురుగాలులు వీస్తాయన్నారు. మూడు రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉన్నవారిని పునరావస కేంద్రాలకు తరలిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ సచివాలయం ఉద్యోగులకు హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. శిథిలావస్థకు చేరిన భవనాల్లో ఉండవద్దని హెచ్చరించారు. చెట్ల కింద నిల్చోవద్దని సూచించారు.

క్షీరా రామంలో యాత్రికుల సందడి

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి ఆదివారం సందర్భంగా పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు యాత్రికులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు 3500 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. పలు రాష్ట్రాల నుంచి పంచారామ క్షేత్రాల పేరుతో వివిధ వాహనాల్లో సుమారు 10వేల మంది వరకు స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాల సమాచారం. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ వాసు, చైర్మన్ మీసాల రాము, ట్రస్టీలు, వలంటీర్లు సేవలందించారు.

టెట్‌కు వ్యతిరేకంగా కోర్టులో పిటిషన్ వేయాలి

పెంటపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యా యులకు నిర్వహిం చే టెట్ పరీక్షలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సీ బొర్రా గోపిమూర్తి డిమాండ్ చేశారు. పెంటపాడు ఎస్‌టీవీఎస్ పాఠశా లలో యూటీఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఆ శాఖ మండల అధ్యక్షుడు పాలూరి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సీ గోపిమూర్తి మాట్లాడుతూ విద్యారంగం అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంటుందని విమర్శించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం మాట్లాడుతూ ఉపాధ్యా యులను బోధనేతర పనులకు వినియోగించి, బోధనకు దూరండా ఉంచడాన్ని ఖండించారు. అనంతరం నిర్వహించిన మండల యూనిట్ ఎన్నికలలో గౌరవ అధ్యక్షునిగా కొల్లూరి మురళికృష్ణ , అధ్యక్షునిగా పాలూరి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కె.కిరణ్‌కుమార్, కోశాధికారిగా సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఎస్.బాలకృష్ణ, పద్మావతి ఎన్నికయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సీ గోపిమూర్తి

కల్తీ మద్యంపై సీబీఐ దర్యాప్తు జరిపించాలి

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యంపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. పోరాట త్యాగధనుడు చింతపల్లి కడెమ్మ 16వ వర్ధంతి సందర్భంగా అరట్లకట్టలో జరిగిన కల్లుగీత కార్మిక సంఘం సమావేశంలో నరసింహమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కల్తీ మద్యానికి కల్లు గీత వృత్తిని బలి చేయరాదన్నారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కామన మునుస్వామి అధ్యక్షత వహించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కల్తీ మద్యం తయారు అవుతున్నా ప్రభుత్వం, అధికారులు స్పందన సరైన రీతిలో లేదన్నారు. నవంబరు 17వ తేదీన మంగళగిరి ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం వద్ద గీత కార్మికులు, వృత్తిదార్ల సమస్యలు తెలియచేయడానికి కార్యాచరణకు పిలుపు నిచ్చారు.

'పవన్ కల్యాణ్‌కు అన్ని విషయాలు చెప్తా'

భీమవరం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పేకాట విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చర్యలు తీసుకున్నందుకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే గ్రంధిశ్రీనివాస్ అన్నారు. ఆదివారంనాడు ఆయన విలేకరులతో మాట్లాడారు. భీమవరం నియోజకవర్గంలో పేకాట అంశం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు. పోలీసులు రెండు నెలలుగా పేకాట క్లబ్‌లను ఆపేశారన్నారు. 14 నెలలుగా క్లబ్ నుంచి సొమ్ములు వసూలు చేస్తున్న వారికి రెండు నెలలుగా ఆదాయం రాకపోవటంతో పోలీస్ అధికారులను టార్గెట్ చేసి ఆయనపై పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చెయ్యటం దారుణమని అన్నారు. పోలీస్ అధికారి పేకాటలను ఎప్పుడు ఆపారో అప్పటి నుంచి వారికి ఆయన వ్యతిరేకం అయ్యాడన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కు డీఎస్పీపై చెప్పింది వినకుండా విచారణకు ఆదేశించటం మెచ్యూర్డ్ పాలిటిక్స్ అని అన్నారు. డీఎస్పీ విషయంలో రఘురామకృష్ణరాజు చెప్పింది కరక్టేనని, అసలు దొంగ ఎవరు అనేది తెలుసుకోవటానికి పవన్‌కు ఒక్క నిమిషం చాలునని అన్నారు. పవన్ కల్యాణ్‌ను కలిసి అన్ని చెప్పాలని తనకు ఉందని పేర్కొన్నారు. ఆయన తనకు అపాయింట్ మెంట్ ఇస్తారో లేదో తెలియదన్నారు.


పాలకొల్లులో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లక్ష రుద్రాక్షలతో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహం వద్ద సంఘు సభ్యులు

వేడుకగా కార్తీక వన సమారాధనలు



పెనుగొండలో టీడీపీ యువ నాయకుడు వెంకట్‌తో ఐరన్, స్టీల్ సంఘు సభ్యులు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీ క్షీరా రామ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఛాంబర్స్ కళాశాలల ఆవరణలో ఆదివారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కృత్తివెంటి భానుమూర్తి సహకారంతో లక్ష రుద్రాక్షలతో శివలింగం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కార్తీక దామోదరుడు, ఉసిరి చెట్టుకు, లక్ష్మీనారాయణ స్వామి, గాయత్రిదేవిలకు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇటీవల పలు ఆలయాలకు ట్రస్టీలుగా నియమితులైన సంఘ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలలో అధ్యక్షుడు సీహెచ్ నరసింహమూర్తి, కార్యదర్శి నందుల దశరథ్, కోశాధికారి గోటేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిధిగా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు.

కోకోనట్ మర్చంట్స్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పలు సంఘాలు సంయుక్తంగా కార్తీక వనసమారాధనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రసధుని సాహితీ సంస్థ, సంస్కార భారతి, హరివిల్లు, నటీనట సంక్షేమ సమాఖ్య, పాలకొల్లు నాటక కళాపరిషత్, తెలుగు భాషా పరిరక్షణ సమితి, కొంతేరు యూత్‌క్లబ్, శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పెనుగొండ:కార్తీక వన సమారాధనలు సంఘ ఐక్యతను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే తనయుడు పితాని వెంకట్ అన్నారు. ఆదివారం పెనుగొండ మార్కెట్ యార్డులో నిర్వహించిన పెనుగొండ ఐరన్ స్టీల్ మర్చంట్ అసోసియేషన్ సభ్యుల కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. సంఘ అధ్యక్షుడు కుడిపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు నౌడు దుర్గారావు, కార్యదర్శి దొడ్డిపట్ల రాంబాబు, కోశాధికారి దొడ్డిపట్ల శివ, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ స్ఫూర్తి రగిలిస్తోంది..


మాట్లాడుతున్న బోగిరెడ్డి ఆదిలక్ష్మి

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మన్‌కీబాత్ ద్వారా వికసిత భారత్ విద్యార్థులకు స్ఫూర్తి రగిలిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని శ్రీచైతన్య పాఠశాలలో మన్‌కీబాత్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం వీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఆదిలక్ష్మి మాట్లా డుతూ ప్రతి నెల ఆఖరి ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో వివిధ వర్గాల విజయ గాథలు, స్ఫూర్తి కలిగించేవారిని మన్‌కీబాత్ ద్వారా అభినందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దువ్వ శ్రీను, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, మాజీ సభ్యులు అడపా రమేష్ పాల్గొన్నారు.

నోటిఫికేషన్ విడుదల

ఆకివీడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ విడుదలైనట్టు ఈవో అల్లూరి వెంకట సత్యనారాయణ రాజు తెలిపారు.



పూర్వ విద్యార్థుల కలయిక

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వారంతా 37 ఏళ్లక్రితం పదోతరగతి చదువుకున్న విద్యార్థులు. వారిలో ఉద్యోగ, వ్యాపారాలు నిర్వహించి రిటైర్మెంట్ ప్రకటించిన వారే ఎక్కువ. వారి కుటుంబ సభ్యులతో కలిసి కార్తీకమాసం సహపంక్తి భోజనాలు చేసి ఆనందోత్సాహాల నడుమ పూర్వ విద్యార్థులు ఆడిపాడారు. తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలులోని తోటలో తాడేపల్లిగూడెం జడ్పీఉన్నత పాఠశాల 1978-79 పదోతరగతి విద్యార్థులు ఆటపాటలతో సరదాగా గడిపారు. ఆ నాటి స్మృతులను నెమరువేసుకున్నారు.

సీనియర్లకు టెట్ పరీక్ష వద్దు

అత్తిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులకు నిర్వహించే టెట్ అర్హత పరీక్ష 2010 తర్వాత ఉద్యోగాల్లో నియమితులైన ఉపాధ్యాయులకే అమలు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి టెక్కలి గణపతి కోరారు. పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో సీహెచ్‌ఎల్‌వీఎస్ చలం అధ్యక్షతన భీమవరంలో జరిగిన సమావేశ వివరాలను ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌సిని ప్రకటించి ఐఆర్‌ను కూడా ప్రకటించాలని కోరారు.

మొక్కలు నాటిన ఏబీఎఫ్


ఏబీఎఫ్ నిర్వాహకులతో విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆత్మబంధువులం సేవా సంస్థ (ఏబీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం వెంకట్రామన్నగూడెం-నల్లజర్ల రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ సహకారంతో కడియం నుంచి పలు రకాల మొక్కలు తెచ్చి సంస్థ నిర్వాహకులు సీతాళం ఉషాకిరణ్ ఆధ్వర్యంలో శశి ఇంజనీరింగ్, లోటస్, ఉద్యాన విశ్వవిద్యాలయ కళాశాల విద్యార్థుల సహకారంతో 5 మీటర్లకు ఒక మొక్క ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చినతాడేపల్లి పిచ్చికల భాస్కరరావు, కుందేటి మురళీకృష్ణ, డాక్టర్ దొరాజి, ఉషాకిరణ్ పాల్గొన్నారు.

రైతులు భయపడొద్దు


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం ఏమవుతుందో అని రైతులు భయపడొద్దని కొంత అప్రమత్తంగా ఉంటే ఈ గండం దాటేయొచ్చని తాడేపల్లిగూడెం ఏడీఏ ఆర్ గంగాధరరావు పేర్కొన్నారు. మాధవరం, దండగర్ర గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వరిచేల పరిస్థితి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. వరిపొట్టదశలో నేలనంటితే లీటరు నీటికి 50 గ్రాముల కల్లుఉప్పు పిచికారి చేస్తే ధాన్యం మొలకలు రాదని ఏవో నారాయణరావు వివరించారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల రైతులు కూటమి నాయకులు పాల్గొన్నారు.


అధికారులు అందుబాటులో ఉండాలి

తణుకు, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అధికారులంతా అందుబాటులో ఉండాలని, ఎప్పటికపుడు ప్రజలను అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశించారు. ఆదివారం క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు కూటమి శ్రేణులు సిద్ధంగా ఉండాలని అన్నారు. నియోజకవర్గంలో తాగునీరు, విద్యుత్ సరఫరా, టవర్సు, పౌరసరఫరాలు వంటి అత్యవసర సేవలు నిరంతరం కొనసాగేలా చూడాలని ఆదేశించారు. గాలులకు విద్యుత్ స్థంభాలు పడిపోయే అవకాశం ఉందని, స్తంభాలు వెంటనే పునరుద్ధరించి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని కోరారు. సహాయ చర్యల్లో పాల్గొనేలా అధికార యంత్రాంగంతో పాటు కూటమి శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

ఉచిత వైద్య పరీక్షలు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ కాపు సర్వీసెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం లయన్స్ క్లబ్‌లో విజయవాడ అను హాస్పటల్స్ వారు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని క్లబ్ గవర్నర్ పి.రామమోహనరావు ప్రారంభించారు. వైద్య పరీక్షల్లో బిపి, షుగర్, గుండె వ్యాధులు, ఎముకలు, చిన్నపిల్లల వ్యాధులు, నరాల బలహీనత, స్త్రీల వ్యాధులపై ఆయా రంగ వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ కానూరి ప్రభాకరరావు, కార్యదర్శి గుండు మోగుల వీరాస్వామి, కోశాధికారి కొండ్రెడ్డి సూరిబాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పంచారామాలకు తొమ్మిది బస్సులు


భీమవరంలో పంచారామక్షేత్ర బస్సు

భీమవరం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచారామాలను దర్శించుకునేందుకు ఆదివారం రాత్రి జిల్లా నుంచి 9 ఆర్టీసీ బస్సులు బయలు దేరి వెళ్ళాయి. భీమవరం డిపో నుంచి 3, తణుకు డిపో నుంచి 3, నరసాపురం డిపో నుంచి 1, తాడేపల్లిగూడెం డిపో నుంచి 2 బస్సులను పంపించారు. భీమవరం బస్‌కాంప్లెక్స్ పంచారామ బస్సులను ఆర్టీసీ డీఎం వై.వేణు కొబ్బరికాయ కొట్టి పంపించారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ సీఐ వై.సురేష్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు. శ్రీశైలంకు ప్రతి రోజు ఉదయం 8 గంటలకు భీమవరం బస్ కాంప్లెక్స్ నుంచి సర్వీసును నడుపుతున్నామని అధికారులు ఉన్నారు.

హైదరాబాద్ బస్సులు ఫుల్

జిల్లా నుంచి హైదరాబాద్‌కు వెళ్ళే 13 సూపర్ డీలక్స్ బస్సులు రిజర్వేషన్‌లు పూర్తి అవ్వటంతో నరసాపురం నుంచి ప్రత్యేకంగా ఎక్స్‌ప్రెస్ సర్వీసును ఏర్పాటు చేశారు. భీమవరం నుంచి రెగ్యులర్‌గా 2, నరసాపురం నుంచి 4, తణుకు నుంచి 4, తాడేపల్లిగూడెం నుంచి 3 సర్వీసులను నడుపుతున్నారు.

43 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పాలకొల్లు టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గ పరిధిలో పేదవర్గాలకు చెందిన 43 మందికి వైద్య సహాయంగా సీఎంఆర్‌ఎఫ్ నుంచి వచ్చిన రు.21లక్షల చెక్కులను తన కార్యాలయంలో మంత్రి డాక్టర్ నిమ్మల అందజేశారు.